సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 25 । నవంబర్ । 2024



సోమశిలలో 70.77 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 70.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 2,250, ఉత్తరకాలువకు 700, దక్షిణకాలువకు 400, కండలేరుకు 2100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,530
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,300
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,519
నవర (8 గ్రాములు)	రూ.60,152

గరిష్టం/కనిష్టం
30.6 /23.8

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 68 శాతం ఉంది.

న్యూస్‌రీల్

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

నెల్లూరు(సెంట్రల్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి వచ్చేందుకు కుటుంబ సభ్యులు వారిని అప్రమత్తం చేయాలిన సూచించారు. బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లో వేటకు వెళ్లొద్దని, అధికారులు సూచనల తరువాత వెళ్లాలని పేర్కొన్నారు.

పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (సెంట్రల్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని, జిల్లాకు భారీ వర్ష సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పొగాకు నాటు వేసిన చోట నీరు నిల్వ ఉంటే బయటకు వెళ్లేలా కాలువలు తీయాలని తెలిపారు. వరి నారుమళ్లు పోసే రైతులు, పోసుకున్న రైతులు అప్పటి వరకు నిరీక్షించి నష్టం వాటిల్లకుండా చూసుకోవాలని సూచించారు. మూడు రోజులు పాటు రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు సమీపంలోని వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

ఫీజులు చెల్లించాలని వేధిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(అర్బన్): ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాలేదనే కారణంతో విద్యార్థులను ఫీజులు చెల్లించాలని వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కళాశాలల యాజమాన్యాలకు కలెక్టర్ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదనే కారణంతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను క్లాసులకు రానివ్వకపోవడం, ప్రాక్టికల్స్‌కు హాజరు కానివ్వకపోవడం, పాస్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వంటి అంశాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీలకు విడుదల చేస్తామని, పాత బకాయిలు కూడా క్రమంగా విడుదల చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులను ఫీజులు విషయమై వేధించొద్దన్నారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఫీజుల విషయమై జిల్లాలో ఎక్కడైనా ఫిర్యాదు అందితే ఆ కళాశాలల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

27న విలువిద్య జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడలోని శాతవాహన కళాశాలలో డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల ఆర్చరీ (విలువిద్య) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు నెల్లూరు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ పి.వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జెరాక్స్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 94419 553345 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



మైపాడు రోడ్డులో టీడీపీ నేతలు దుకాణాలతో చేపడుతున్న ఆక్రమణలు

బీచ్ రోడ్డు.. తమ్ముళ్ల అడ్డా

అమాత్యా.. ఇదేనా స్మార్ట్ సిటీ ప్రోగ్రామ్

తమ్ముళ్ల కళ్లల్లో ఆనందం కోసం అమాత్యుల ఆదేశాలంటూ మున్సిపల్ అధికారులు బీచ్ రోడ్డులో ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్ల వెచ్చించి నగరం నుంచి మైపాడు వెళ్లే రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించి.. రహదారికి ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తే.. మున్సిపల్ మంత్రి చెప్పారంటూ ఆ రహదారి వెంట టీడీపీ నేతలు ఆక్రమిస్తుండడంపై నగర వాసులు మండి పడుతున్నారు. అమాత్యా ఇదేనా స్మార్ట్ సిటీ ప్రోగ్రామ్ అంటూ నిలదీస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.20 కోట్లతో మైపాడురోడ్డు విస్తరణ
- ఆక్రమణదారులకు న్యాయం చేసి నాలుగులేన్లగా అభివృద్ధి
- పార్కులు అభివృద్ధి చేసి సాయంత్రం వేళ ఆహ్లాదకర వాతావరణం సృష్టి
- మంత్రి నారాయణ చెప్పారంటూ ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగరాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానంటూ హామిలిచ్చిన మంత్రి నారాయణ నగరాన్ని నరక కూపంలా మార్చేస్తున్నారు. నగరంలో ఆహ్లాదరకమైన వాతావరణాన్ని ఆవిరి చేస్తూ రహదారుల వెంట ఆక్రమణలకు ప్రోత్సహిస్తున్నారు. కార్యకర్తల కళ్లల్లో ఆనందం కోసం దురాక్రమణలు ప్రోత్సహిస్తూ నగర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా చేస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరు–మైపాడు బీచ్ రోడ్డును తమ్ముళ్ల అడ్డాగా మార్చేస్తున్నారు.

నాలుగులేన్లుగా అభివృద్ధి

జిల్లాలో పర్యాటక ప్రాంతంగా మైపాడు బీచ్ విలసిల్లుతోంది. ఇందుకూరుపేట మండలంలోని గ్రామాలతో పాటు మైపాడు బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారి దశాబ్దాలుగా సింగిల్ రోడ్డుగా ఉండేది. ఎన్నో ప్రభుత్వాలు మారినా అప్పటి మంత్రులు కానీ, ప్రజాప్రతినిధులు, అధికారులెవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ మైపాడురోడ్డు అభివృద్ధి చేయాలని సంకల్పించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించారు. నగరంలోని పాతచెక్‌పోస్టు వద్ద నుంచి వేణుగోపాల్‌నగర్ (చేపల మార్కెట్) వరకు మైపాడురోడ్డును నాలుగు లేన్ల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అందుకోసం మైపాడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు ఆక్రమణదారులకు న్యాయం చేశారు. రూ.20 కోట్లతో 2.7 కి.మీ. మేర నాలుగు లేన్ల విస్తరణ పనులతోపాటు, సిమెంట్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లలో పచ్చదనం పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో పాటు మైపాడురోడ్డు వెంబడి ఉన్న జాఫర్‌సాహెబ్ కెనాల్‌కు ప్రహరీ నిర్మించేందుకు రూ.కోట్లు వెచ్చించి రివిట్‌మెంట్ కూడా చేపట్టారు. జాఫర్‌సాహెబ్ కెనాల్‌కు మైపాడురోడ్డుకు మధ్యలో 2 కి.మీ మేర ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కు, పచ్చదనం, వాకింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందు ప్రణాళికలు రూపొందించి అందుకు అవసరమైన పనులు చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు కొంత మేర జరిగి నిలిచిపోయాయి.

చిక్కిపోతున్న రహదారి

జాఫర్‌సాహెబ్ కాలువకు మైపాడురోడ్డుకు మధ్యలో ఖాళీ స్థలంలో ఇప్పటికే రేకులతో తయారు చేసిన దుకాణాలు, ఫుడ్ కోర్టు మోడల్‌లో రేకులతో తయారు చేసిన షెడ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని పాదుపు మహిళల ఉపాధి కోసమని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వాస్తవానికి టీడీపీకి సంబంధించిన వారి కోసం ఇవి ఏర్పాటు చేస్తున్నారని మరో పక్క ప్రచారం జరుగుతోంది. ఇదే కొనసాగితే మైపాడు రోడ్డు విస్తరణ కోసమని తొలగించిన ఆక్రమణలు మళ్లీ యథావిధిగా రోడ్డు ఆక్రమణకు గురై చిక్కిపోతోంది. ఇప్పటికే మైపాడురోడ్డు పక్కనున్న ఖాళీ స్థలం ఆక్రమించేందుకు పలువురు టీడీపీ నేతల కళ్లు పడ్డాయని సమాచారం. ఆక్రమణదారులు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. దుకాణాల ఏర్పాటుతో పాటు ప్రైవేట్ వ్యక్తులు కూడా వాటి పక్కనే మరి కొన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు చిన్న చిన్న ఇళ్ల నిర్మాణాలు కూడా జరిగే పరిస్థితి నెలకొంది. ఇదే కనుక జరిగితే మైపాడురోడ్డు ఆక్రమణకు గురవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొనడమే కాకుండా తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితి ఉంటుంది.

అభివృద్ధి ఆగిపోయింది.. ఆక్రమణలకు తెరలేసింది..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెబుతున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అభివృద్ధికి పాతరేసి, ఆక్రమణలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మైపాడురోడ్డులో నగరంలోని పాత చెక్‌పోస్టు నుంచి వేణుగోపాల్‌నగర్ వరకు నాలుగు లేన్ల సిమెంట్ రోడ్డు విస్తరించి ఉన్న మైపాడు రోడ్డు పక్కనే వాకింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటు కోసం గతంలో చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తాజాగా ఆ ప్రాంతంలో నేడు ఆక్రమణలకు తెర లేపుతున్నారు. ప్రస్తుతం జాఫర్‌సాహెబ్‌కెనాల్‌కు, మైపాడు రోడ్డుకు మధ్యలో అభివృద్ధి చేసిన ఖాళీ స్థలంలో పురపాలక మంత్రి ఆదేశాల మేరకు రేకులతో తయారు చేసిన దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఓ వైపు నగరంలో ఎక్కడా కూడా ఆక్రమణలను ఉండకూడదని ఉంటే వాటిని వెంటనే తొలగించాలంటూ అధికారులను ఆదేశిస్తున్న సదరు మంత్రి జాఫర్‌సాహెబ్‌కాలువ పక్కన నేడు ఆక్రమణలను ప్రోత్సహించడం ఎంత వరకు సబబు అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలను ఎవరూ సహించరు



ప్రజల సౌకర్యార్థం మైపాడురోడ్డును ఎంతో సుందరంగా తీర్చిదిద్దితే ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని ఎవరూ సహించరు. అభివృద్ధిని మరింతగా చేసి చూపిస్తే ప్రజలు హర్షిసారు. అంతేకాని చేసిన అభివృద్ధిని చెడగొట్టాలనే ప్రయత్నం చేయడం స్థానికులు చూస్తూ ఊరుకోరు. మైపాడురోడ్డులో దుకాణాల ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలి.

– సుబ్బారెడ్డి, శ్రీనివాసనగర్

పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

వ్యవసాయానికే కాదు పాడి సంపదను పోషించడానికి రైతులకు ఎక్కువ పెట్టుబడే అవుతోంది. పశువులు కొనుగోలుతో పాటు వాటి దాణా ఖర్చు పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవడానికి పంటలకు రుణాలిచ్చినట్లే పాడి పశువుల కోసం ప్రత్యేకంగా పశు కిసాన్ క్రెడిట్ కార్డులను (పీకేసీసీ) జారీ చేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. వడ్డీ లేకుండానే స్వల్పకాలిక రుణాలను పొంది పాడి సంపదను వృద్ధి చేసుకోవడానికి వీలుంటుంది.

– కావలి



- పాడి రైతుకు రూ.3 లక్షల బ్యాంకు రుణం
- 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే వడ్డీ ఉండదు
- ఆ తర్వాత అయితే 7 శాతం వడ్డీ చెల్లించాలి
- జిల్లాలో 8,100 కార్డులు ఇవ్వాలని లక్ష్యం

ఏ విధంగా ఉపయోగించుకోవచ్చంటే..



- పశుసంవర్ధక రైతులందరి ప్రయోజనం కోసం భారత ప్రభుత్వం 'పశు కిసాన్ క్రెడిట్ కార్డ్'ని ప్రారంభించింది. అర్హులైన రైతులకు పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు ఆయా బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులకు పీకేసీసీ కార్డులు అందించాల్సి ఉంది.
- రైతులు పశువులు, దాణా, మేత కొనుగోలు చేసేందుకు డబ్బుల కోసం ఇబ్బంది పడుతుంటారు. పశువులు, సన్న జీవాలకు షెడ్లు, మంచినీటి తొట్టెల నిర్మాణం, తాళ్లు, ఇతర సామగ్రితో పాటు పశుగ్రాసం కొనుగోలుకు ఈ రుణాలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది.
- పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ద్వారా 4 శాతం వడ్డీకి రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తోంది. ఇందులో రూ.1.6 లక్షల వరకు ఎలాంటి హామీ అవసరం ఉండదు. పశు పోషకులు డబ్బులు అవసరమైన సమయంలో తీసుకుని వాడుకోవచ్చు. ఇలా తీసుకున్న డబ్బుల్ని 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. ఒక వేళ 40 రోజులు దాటాక చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. రైతులపై కేవలం 4 శాతం వడ్డీనే పడుతుంది. పశువుల యజమానులు ఏడేళ్లలోపు వడ్డీతో పాటు రుణాన్ని చెల్లించాలి.
- పాల విక్రయాల ద్వారా ఆదాయం వచ్చినప్పుడల్లా 40 రోజుల్లోగా జమ చేయొచ్చు. మళ్లీ డబ్బులు తీసుకోవచ్చు. ఇలా ఈ కార్డులను సక్రమంగా వాడుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. ఈ కార్డు ద్వారా అదనంగా పశువులను కూడా కొనుగోలు చేసుకోవచ్చు.
- పాడి రైతులకు పీకేసీ కార్డులు ఇస్తారనే విషయం చాలా మందికి తెలియదు. వీటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించడమూ లేదు. పెద్ద రైతులు, నేతలతో సత్సంబంధాలున్న రైతులకే ఈ కార్డులు అందజేస్తున్నారు. కొంత మంది దరఖాస్తు చేస్తున్నా బ్యాంకర్లు మోకాలడ్డుతున్నారు. గతంలో ఇచ్చిన రుణాలు సక్రమంగా చెల్లించడం లేదని, సిబిల్ స్కోర్ లోపించిందని కొర్రీలు పెడుతుండడంతో రైతులకు పీకేసీ కార్డుల ప్రయోజనాలు దక్కడం లేదు.



- జిల్లాలో పాడి పశువులు, వాటిని నమ్ముకుని జీవనోపాధి పొందే రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డులు (పీకేసీసీ) మాత్రం వందల సంఖ్యలోనే జారీ చేస్తున్నారు. 2023–24లో పశు కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం 12,500 మందికి పైగా పాడి రైతులు దరఖాస్తు చేస్తే అందులో కేవలం 4,500 మందికి మాత్రమే ఈ కార్డులు మంజూరు చేశారు.
- ఈ ఏడాది జిల్లాలో 8,100 కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటి వరకు ఇప్పటి వరకు పాడి రైతుల నుంచి 4,708 దరఖాస్తులు అందాయి. ఈ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నా అరకొరగానే జారీ చేస్తుండడంతో పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోండి

పశు పోషణకు అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేస్తారు. వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయడానికి ఈ కార్డులను జారీ చేస్తుంది. గొర్రెలు, మేకలు ఉన్న రైతులు కూడా ఈ కార్డుల ద్వారా రుణాలు పొందడానికి అర్హులు. రైతులు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్స్ కాపీలతో స్థానిక పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలి.

– డాక్టర్ కె.రమేష్‌నాయక్, జేడీ, పశుసంవర్ధక శాఖ, నెల్లూరు

బింబం.. ప్రతిబింబం



సాయం సంధ్యవేళ భానుడు మబ్బుల చాటున అస్తమిస్తుండగా నింగి నేల ఏకమైనట్టు భ్రమింప చేసే దృశ్య కావ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. పంట పొలాల్లో నిర్మలమైన జల కాన్వాస్‌పై కనిపించిన ప్రకృతి ప్రతిబింబం వర్ణ శోభితం. ముత్తుకూరు రోడ్డులో ముసునూరువారిపాలెం సమీప పంట పొలాల్లో ఆదివారం సాయంత్రం వేళ మేఘ వర్ణ చిత్రం అద్భుతం. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆరోగ్యం.. అనారోగ్యం

కాకతాళీయమో.. ఉద్దేశ పూర్వకమో తెలియదు.. ఒక వైపు ఆరోగ్యాన్ని కాపాడే 'మందులు' దుకాణం. మరో వైపు అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే 'మద్యం' దుకాణం పక్కపక్కనే ఉన్నాయి. వాస్తవానికి మందుల దుకాణం ఎంతో కాలంగా అక్కడే ఉంది.. కానీ ఇటీవల మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్లో మందుల దుకాణం పక్కనే మద్యం దుకాణం చూసి జనం ఔరా అని ఆశ్చర్యపోతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



దివంగతులూ.. ఓటర్లే!

- నీటి సంఘాల ఓటర్ల జాబితా తప్పుల తడక

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తలపెట్టిన సాగు నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయి. దివంగత రైతులు కూడా ఓటర్ల జాబితాల్లో ఉండడం విశేషం. అక్టోబరు 6వ తేదీ నుంచి ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నా.. కచ్చితమైన జాబితా చేయలేకపోవడం చూస్తే అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అధికార పార్టీకే పదవులు కట్టబెట్టాలనే దుర్గతోనే ఇలాంటి తప్పుల తడకల జాబితాలను సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఓటర్ల జాబితాను బహిర్గతం చేయకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వవ్వేరు, న్యూ వవ్వేరు, రేబాల, పెనుబల్లి, దామరమడుగు ఐదు నీటి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితా రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయం, నీటి పారుదలశాఖ సెక్షన్ కార్యాలయాల్లో ప్రచురించాల్సి ఉంది. అక్టోబరు 13వ తేదీన ఫైనల్ జాబితా ప్రచురించాల్సి ఉన్నా.. ఇంత వరకు జాబితాలు రైతుల కంట పడకుండా చేయడం గమనార్హం. అసలు జాబితాలు ప్రచురణ విషయం కూడా బయటకు వెల్లడించకపోవడం చూసి రైతు సంఘాల నాయకులు, రైతులు అనుమానాలతో పాటు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగాలేని జాబితాలు..

సిద్ధమైన ఓటరు జాబితాలు చూస్తే పారదర్శకంగా లేవని తెలుస్తోంది. ఓటర్లుగా ఎప్పుడో చనిపోయిన వారు, గతంలోనే భూములు అమ్ముకున్న రైతుల పేర్లు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఉన్న భూ రెవెన్యూ రికార్డులకు, ఓటర్ల జాబితాకు పొంతన లేదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. తప్పుల తడకగా జాబితాను తయారు చేయడం వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. లేనివారి ఓట్లు చేర్చడంతోనే జాబితాలను బయటకు ప్రచురించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. ఇదే విషయాన్ని పరోక్షంగా జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు పేర్కొనడం గమనార్హం. కేవలం అధికార పార్టీ వారికి మాత్రమే జాబితాలు అందజేయడం గమనార్హం.

ఆత్మలతో అధికారం దక్కించుకోవాలనే..

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రూపొందించి అత్యంత గోప్యంగా ఉంచిన ఓటర్ల జాబితాలను పరిశీలిస్తే.. ఆత్మల ఓట్లతో అధికారం చేజిక్కించుకునే దిశగా అధికార పార్టీ కుట్రగా తెలుస్తోంది. అధికార అక్రమాలకు అధికారులు సహకారం అందించడాన్ని రైతులు, రైతు సంఘాలు మండి పడుతున్నాయి. లోపభూయిష్టమైన ఓటర్ల జాబితాను సవరించే అవకాశాన్ని రైతులకు కల్పించకుండా మొక్కుబడిగా ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల సక్రమంగా లేకుంటే మండలంలోని 8,103 ఎకరాలకు అన్యాయం జరుగుతోంది. సాగునీటి సంఘాల ఎన్నికలపై అధికార పార్టీ నాయకులు రోజుకో ప్రకటన చేస్తున్నారు. ఓటర్ల జాబితాలు పరిశీలిస్తే..

- వవ్వేరు నీటి సంఘం ఓటర్ల జాబితాలో 25 ఏళ్ల క్రితం మృతి చెందిన బెజవాడ రామచంద్రారెడ్డి, పొన్నలూరు రామచంద్రారెడ్డి, మోర్ల బసవయ్య, ఆరుగుంట కృష్ణవేణమ్మ, దొడ్ల భూదేవమ్మ, కాకుటూరు ఆనందరావు, ఆలూరు రంగయ్య, పందిళ్లపల్లి మస్తానయ్య పేర్లు ఉన్నారు.
- న్యూవవ్వేరు నీటి సంఘం జాబితాలో 20 ఏళ్ల క్రితం మృతి చెందిన డొంకల సుబ్బానాయుడు, చెరుకుమూడి లలితాంబ, మేకా మస్తానయ్య, 15 ఏళ్ల క్రితం మృతి చెందిన మేకా శ్రీనివాసులు నాయుడు, మోర్ల శేషయ్య, కోటంరెడ్డి రంగారెడ్డి, పదేళ్ల క్రితమే కాలం చేసిన తుమ్మల వెంకటనర్సయ్య, అత్తిపల్లి సుందరరామిరెడ్డి, దొడ్ల ముద్దుకృష్ణారెడ్డితోపాటు మరో 50 మందికి పైగా ఇలాంటి ఓటర్లు ఉండడం విస్మయం కలిగిస్తోంది.
- ఒక్క నీటి సంఘంలోనే ఇంత మంది మృతి చెందిన వారితో జాబితాను సిద్ధం చేయడం ఒక్క రెవెన్యూ శాఖకే దక్కింది. ఈ జాబితాలను నోటీసు బోర్డుల్లో పెడితే తాము తయారు చేసిన తప్పులు తడక విషయం బయటకు పొక్కితే నవ్వుల పాలవుతామని అధికారులు తమ స్వామి భక్తిని చాటుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇలాంటి ఓటర్లతోపాటు కొన్నేళ్ల క్రితం భూములు అమ్మివేసిన వారి పేర్లు జాబితాలో ఉంచి ప్రస్తుతం ఉన్న రైతుల పేర్లు జాబితాలో కనిపించక పోవడం రెవెన్యూ శాఖ లీలలకు అద్దం పడుతోంది.
- ఇలాంటి లీలలే కాకుండా ఒకే రైతు పేరు పది నుంచి 15 చోట్ల నమోదు కావడం గమనార్హం.

సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీతో ప్రతిభకు పదును

- సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్లో పరీక్షలు
- 400 మంది విద్యార్థుల హాజరు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలోని పార్థసారథినగర్‌లో గల సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్లో స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలను 'సాక్షి' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మొత్తం నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన పరీక్షలకు వివిధ పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెయిన్‌బో, ప్రియాంక స్కూల్, ఓవెల్ గ్రూప్, శ్రీనికేతన్, అక్షర విద్యాలయం, ఎస్వీఎస్ తదితర స్కూళ్ల విద్యార్థులు పరీక్షకు ఉత్సాహంగా వచ్చారు. సాక్షి నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్ష తమ పిల్లల ప్రతిభకు మరింత పదును పెడుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


పరీక్షకు హాజరైన విద్యార్థులు

SAKSHI MATH BEE 2024-25

SAKSHI SPELL Bee 2024-25


కేంద్రం బయట తల్లిదండ్రులు


పరీక్షలో నిమగ్నమై..

ఇలాంటి పరీక్షలు ఉపయోగం


'సాక్షి' ఇలాంటి పరీక్షలు నిర్వహించడం మాకు ఎంతో ఉపయోగం. మరిన్ని పరీక్షలు నిర్వహిస్తే మాలో ఉన్న విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుంది.

– నీలేష్, ముదివర్తి, జెడ్పీ హైస్కూల్, 9వ తరగతి

నిర్వహణ బాగుంది


స్పెల్ బీ పరీక్షల నిర్వహణ బాగుంది. పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు దోహదపడుతుంది. ఇలాంటి పరీక్షలకు హాజరుకావడం సంతోషంగా ఉంది.

– విష్ణు, రెయిన్‌బో, 9వ తరగతి

పోటీ పరీక్షలకు దోహదపడుతుంది


మేము స్కూల్లో అన్ని సబ్జెక్ట్‌లను నేర్చుకుంటాం. అయితే ఇలాంటి పరీక్షలతో మా సామర్థ్యం ఎంత, మేము ఏ విధంగా విజయం సాధిస్తామో తెలుస్తుంది.

– చార్మీ, మోడరన్ ఓవెల్ స్కూల్, 8వ తరగతి

పరీక్షలను మరిన్ని నిర్వహించాలి


ఇలాంటి పరీక్షలను సాక్షి నిర్వహించడం చాలా బాగుంది. విద్యార్థుల ప్రతిభను బయట పెట్టేందుకు దోహదపడుతున్నాయి. ఇలాంటి పరీక్షలను మరిన్ని నిర్వహించాలని కోరుతున్నా.

– జయశ్రీ, ఓవెల్ స్కూల్ టీచర్

విద్యార్థుల ప్రతిభ తెలుస్తుంది


విద్యార్థుల ప్రతిభ ఏ స్థాయిలో ఉందో ఈ పరీక్షల ద్వారా తెలుస్తుంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించడం ద్వారా రానున్న రోజుల్లో విద్యార్థుల్లో మనోధైర్యం బలపడుతుంది.

– సీమా, ఓవెల్ మోడరన్ టీచర్

మొదటిసారి పరీక్ష రాశారు


పదో తరగతి చదివే నా కూతురు ధనలక్ష్మి, 9వ తరగతి చదివే సుషాంత్ మొదటి సారి పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ బాగుంది. సాక్షికి ధన్యవాదాలు.

– కేవీ రమణారెడ్డి, విద్యార్థి తండ్రి

మూడుసార్లు రాశాడు


నా కుమారుడు ప్రణవ్ మూడో తరగతి చదువుతున్నాడు. మొదటి తరగతి నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు పరీక్ష రాశాడు. గతేడాది ఫైనల్స్‌కు కూడా వెళ్లాడు. సాక్షి నిర్వహిస్తున్న పరీక్షలు బాగున్నాయి.

– రాధిక, విద్యార్థి తల్లి

ప్రతిభకు ఉపయోగం


పాఠశాలల్లో నేర్చుకునే పాఠాలతో పాటు మా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి పరీక్షలను మరిన్ని నిర్వహించాలి.

– అనూష, శ్రీనికేతన్, 9వ తరగతి

ఇలాంటి పరీక్షల్లో పాల్గొంటాం


ఈ పరీక్షల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లోనూ ఇలాంటి పరీక్షలకు కచ్చితంగా హాజరవుతా. మా స్టడీస్ ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతున్నాయి.

– ఇషిక, ఓవెల్ స్కూల్, 9వ తరగతి

పోటీ పరీక్షలకు దోహదం


ఇలాంటి పరీక్షల్లో మొదటి సారి పాల్గొన్నాను. పోటీ పరీక్షలకు ఏ విధంగా పాల్గొనాలనే అంశంలో ఇవి ఎంతో దోహదపడుతున్నాయి. ఇలాంటి వాటిని మరిన్ని నిర్వహించాలి.

– యువన్ శంకర్, ఎస్వీఎస్ స్కూల్, 4వ తరగతి

క్లుప్తంగా

పశుగణనకు పాడి రైతులు సహకరించాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో నిర్వహిస్తున్న పశుగణనకు పాడి రైతులు సహకరించాలని పశుగణన నోడల్ అధికారి డాక్టర్ మంజునాథ్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 15 శాతం మేరే ప్రక్రియ జరిగిందని చెప్పారు. సమయానికి మూగజీవాల్లేకుండా పోవడం.. మేతకెళ్లడం.. పాడి రైతులు అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమవుతోందని వివరించారు. గ్రామాలకు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది వచ్చిన సమయాల్లో సహకరించాలని కోరారు.

గంజాయి తరలిస్తుండగా అరెస్ట్

- ఎనిమిది కిలోలు స్వాధీనం


నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరు తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. తనిఖీల వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి తన కార్యాలయంలో వెల్లడించారు. జాతీయ రహదారిపై వెంకటాచలం టోల్ ప్లాజా సమీపంలో వాహన తనిఖీలను తెల్లవారుజామున నిర్వహించారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, లంబసింగి కట్టిముల్లకు చెందిన లోవరాజు అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల బ్యాగ్‌ను తనిఖీ చేయగా, ఎనిమిది కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడ్ని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. గంజాయి మత్తుకు బానిసైన లోవరాజు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో లంబసింగిలో కొనుగోలు చేసి బెంగళూరులో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని వెల్లడైంది. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జిల్లాలో పోలీసుల స్పెషల్ డ్రైవ్


వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): అక్రమ రవాణా.. అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌ను పోలీసులు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో వాహన తనిఖీలను విస్తృతంగా చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 19 మందిపై.. నిబంధనలను ఉల్లంఘించి డ్రైవింగ్ చేస్తున్న వారిపై 227 కేసులు నమోదు చేసి రూ.1,16,635 జరిమానాను విధించారు. పలు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 29 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌ను శనివారం రాత్రి 11 గంటల నుంచి రెండు గంటల పాటు చేపట్టామని వివరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 87
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 166
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 186
లేయర్ చికెన్	: 187



నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15



సాగుకు ప్రకృతి గండం

తీవ్ర వర్షాభావం.. ఐఏబీ ఆలస్యం

- 7.5 లక్షల ఎకరాలకు నీరిస్తామన్న ప్రజాప్రతినిధులు
- తాజా వాయుగుండంతో అన్నదాతల ఆందోళన

జిల్లాలో సాగు ఓ అడుగు ముందుకు.. మరో అడుగు వెనక్కి అనే చందంగా మారింది. రబీ సీజన్ ప్రారంభమై నెల దాటుతున్నా, వరిసాగు ఆశించిన స్థాయిలో జరగడంలేదు. వేసిన పంట వర్షాలతో మొదట్లోనే మునిగి అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చింది. మరోవైపు చేతికొచ్చేంత వరకు గ్యారెంటీ లేకపోవడం.. ధాన్యమొచ్చినా గిట్టుబాటు ధర ఉంటుందో లేదో తెలియడంలేదు. తాజాగా మరో వాయుగుండం పొంచి ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది.


సాగులో ఉన్న వరి

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో ఈ ఏడాది రబీ సాగు మరింత ఆలస్యమవుతోంది. సీజన్ ప్రారంభమై నెలవుతున్నా, వరిసాగు మందకొడిగా ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. నారుమళ్లను రైతులు వేయగా, ఇటీవల వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో అవి కొన్ని ప్రాంతాల్లో కొట్టుకుపోయి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

సాగునీటి విడుదల్లోనూ అంతే..

రబీ సీజన్ నేపథ్యంలో సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ఈ నెల్లో నిర్వహించారు. 7.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే సాగునీటిని విడుదల చేసే పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించి, సాగునీటి విడుదల్లోనూ జాప్యం చేస్తున్నారు.

సాగు తగ్గుముఖం

రబీ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో వరి సాగును చేపట్టడం పరిపాటిగా వస్తోంది. 2019 నుంచి 2023 వరకు ఈపాటికే జిల్లాలో దాదాపుగా లక్ష ఎకరాల్లో సాగుచేసేవారు. అయితే ప్రస్తుతం ఇది గణనీయంగా తగ్గిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వర్షాలతో దాదాపు 500 ఎకరాల్లో నర్సరీ సాగు నీట మునగడంతో రైతులు నష్టపోయారు.

రంగంలోకి దళారులు

2014 నుంచి 2019 వరకు జిల్లాలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సాగును అరకొరగా చేపట్టారు. రైతుల వద్దకు దళారులొచ్చి రేటును నిర్దేశించి మోసం చేసేవారు. ప్రస్తుతం ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం కనిపిస్తోంది. రైతుల వద్దకు దళారులు వెళ్లి కొంత నగదును అందజేసి తమకే ధాన్యాన్ని విక్రయించాలనే షరతులు పెడుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుత రబీ సీజన్లో వరిని సాగుచేసినా, వాతావరణం అనుకూలించి చివరి వరకు పంట వస్తుందాననే అనుమానాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నారుమళ్లు వేద్దామా.. వద్దా..?

రబీ సీజన్ ప్రారంభంలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు నారుమళ్లకు కొంత మేర నష్టం వాటిల్లింది. తాజాగా ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు వాయుగుండం ముప్పు ఉందనే హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. ఫలితంగా నారుమళ్లు వేద్దామా.. వద్దాననే మీమాంశలో వారు కొట్టుమిట్టాడుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం


జిల్లాలో వరి సాగుకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా మండలాల్లోని అధికారులను అప్రమత్తం చేశాం. సాగుకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను అందుబాటులో ఉంచాం. ధాన్యం గిట్టుబాటు, కొనుగోలు వ్యవహారాలను పౌరసరఫరాల శాఖ పర్యవేక్షిస్తుంది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రియుడ్ని పిలిచి.. ఆపై దోచేసి

- పట్టుబడిన ముఠా
- ప్రేమజంట, నిందితులు నెల్లూరు వాసులు

బనశంకరి (బెంగళూరు): ప్రియుడ్ని అపహరించి దోపిడీ చేయాలని భావించిన ఓ యువతి చివరికి కటకటాల పాలైంది. బెంగళూరు పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన శివ, మోనిక మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. నెల్లూరులో మెడికల్ షాపును నిర్వహిస్తున్న శివ వద్ద బాగా డబ్బు, బంగారం ఉందని భావించిన మోనిక ఆయన్ను కిడ్నాప్ చేసి భారీగా వసూలు చేయాలని తనకు తెలిసిన వారితో కుట్ర పన్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం శివకు ఫోన్ చేసి, మిమ్మల్ని చూడాలని ఉంది, బంగారు ఆభరణాలు ధరించి ఇన్నోవాలో రావాలని సూచించారు. ఆమె మాటలను నమ్మిన శివ 60 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ఇన్నోవాలో పుట్టపర్తి జిల్లా హిందూపురం వద్ద గల పెనుకొండకు వచ్చారు. అక్కడ మోనిక అనుచరులు శివను కారులో అపహరించి బంగారు ఆభరణాలను దోచుకొని పావగడకు తీసుకెళ్లి ఓ హోటల్లో బంధించారు. రూ.పది లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. శివ తన స్నేహితులతో మాట్లాడి తన బ్యాంక్ ఖాతాలోకి రూ.ఐదు లక్షలను జమ చేయించారు.

ఏటీఎం కార్డు తెప్పించి..

డబ్బు డ్రా చేయాలంటే ఏటీఎం కార్డు లేదు. దీంతో నెల్లూరులోని ఇంటి నుంచి బెంగళూరు మెజెస్టిక్ చిరునామాకు కొరియర్ చేయించుకున్నారు. బెంగళూరులోని కోరమంగళలో నగదు డ్రా చేయడానికి శనివారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో కిడ్నాపర్ల మధ్య గొడవ చోటుచేసుకుంది. గస్తీలో ఉన్న ఎస్సై మాదేశ్ అనుమానంతో వారిని విచారించగా కిడ్నాప్ కథ వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసులు మోనిక, హరీశ్, హరికృష్ణ, నరేశ్, రాజ్‌కుమార్, నరసింహ, అంజనీల్‌ను అరెస్ట్ చేశారు. కిడ్నాపర్లు నెల్లూరుకు చెందిన వారని డీసీపీ సారా ఫాతిమా తెలిపారు. నిందితుల్లో ఇద్దరిపై ఐదుకుపైగా కేసులున్నాయని చెప్పారు. దోపిడీకి సూత్రధారి మోనిక అని తెలుసుకొని శివ షాక్‌కు గురయ్యారు. కేసు విచారణలో ఉందని డీసీపీ తెలిపారు.

రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్ర


సమావేశానికి హాజరైన మాలలు


మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్‌రావు

- దీని కోసమే ఎస్సీ వర్గీకరణ
- మాలల మహాగర్జన సభలో మాజీ ఎమ్మెల్సీ జూపూడి

కందుకూరు: ఆరెస్సెస్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాజ్యాంగం నుంచి రిజర్వేషన్లను ఎత్తేసే కుట్రలో భాగంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ, మాలమహానాడు మాజీ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. కనిగిరి రోడ్డులోని మెర్సీ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మాలల మహాగర్జన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మాలలు, మాదిగల మధ్య అవగాహన లోపం కారణంగానే అనర్థాలు జరుగుతున్నాయని చెప్పారు. వర్గీకరణ ఉద్యమం సరైందికాదని శంకరన్ వంటి మేధావులు గతంలోనే చెప్పారని వివరించారు. అప్పట్లో దేశం మొత్తం తిరిగి 1032 కులాలను అధ్యయనం చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రిజర్వేషన్లను రాజ్యాంగంలో పొందుపర్చారని వివరించారు. వర్గీకరణకు సంబంధంలేని అంశాలను మంద కృష్ణమాదిగ తీసుకొచ్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్‌ను అమలు చేయమని సుప్రీం కోర్టు చెప్పిందని, దీని ప్రకారం చూస్తే భవిష్యత్తులో వాచ్‌మెన్, అటెండర్ వంటి ఉద్యోగాలకు కూడా రిజర్వేషన్లు వచ్చే పరిస్థితి ఉండదన్నారు.

మోసం చేసేందుకు చంద్రబాబు కుట్ర

రాజ్యాంగం.. సుప్రీం కోర్టు తీర్పుల మేరకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకునే కులాన్ని ఎంపిక చేయాలని ఉందే తప్ప, జిల్లా యూనిట్‌గా కులాన్ని ఎంపిక చేసే సదుపాయం లేదని తెలిపారు. అయితే సీఎం చంద్రబాబు జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్తున్నారని, ఇది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మాదిగలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తిరిగి కోర్టును ఆశ్రయించనున్నామని, రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని నిరూపిస్తామని స్పష్టం చేశారు.

ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక

తెలంగాణలో ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికను రూపొందిస్తున్నామని ఆ రాష్ట్రంలోని చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, నాగరాజు చెప్పారు. మాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వినతిపత్రమిచ్చామని తెలిపారు. మాలల సింహగర్జన పేరుతో హైదరాబాద్‌లో డిసెంబర్ ఒకటిన పది లక్షల మందితో భారీ సభను నిర్వహించనున్నామని చెప్పారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ పందు అశోక్‌బాబు, మాల జేఏసీ అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి, జాతీయ ఆర్గనైజర్ అన్నవరపు కిశోర్, మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, నియోజకవర్గ గౌరవ సలహాదారుడు దాసరి చినమాలకొండయ్య, వెంకటేశ్వర్లు, చనమాల వెంకటేశ్వర్లు, లింగాబత్తిన బ్రహ్మయ్య, గడ్డం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.